


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక




సంపుటి: 01 సంచిక : 281. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.25.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## పింఛన్లు ఇవ్వడం సామాజిక బాధ్యత



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వడం సామాజిక బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) నొక్కి చెప్పారు. సమాజంలో పేదరికం తగ్గించ కుంటే అంతరాలు మరింత పెరిగిపోయే అవకాశముంద న్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో చేయూత పింఛన్ల పంపిణీపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అందులో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, డైరెక్టర్ గోపి, జిల్లాల ప్రాజెక్టు ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీలో కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజమైన లబ్దిదారులకు పింఛన్లు చేరే విధంగా అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించారు. అనర్హులు పింఛన్ తీసుకుంటే పేద వారికి అన్యాయం చేసినట్టు అవుతుందని తెలిపారు. సాంకేతిక కారణాలతో పింఛన్ల పంపిణీ ఆలస్యమైతే ఉన్నతాధికారులకు ముందే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా అర్హులకే పెన్షన్ అందుతుందని చెప్పారు. ప్రతి నెలా వెయ్యి కోట్ల రూపాయల పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పిల్లలు వదిలేసిన తల్లిదండ్రులకు ప్రభుత్వం ఇచ్చే పింఛనే చేయూత, వారి ధైర్యం అని చెప్పారు. ఇప్పలద్దు క్రెడిట్ అంతా ఐఏఎస్ దివ్యకే దక్కుతుందనీ, ప్రతి అధికారి కూడా తన కంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలని సూచిం చారు. పేదరిక నిర్మూలన కోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలివ్వడం, ఇందిరా మహిళా క్యాంటీన్‌లు ఏర్పాటు చేయించడం, ప్రమాద బీమా వర్తింపజేయడం వంటి కార్యక్రమాల ద్వారా పేదలకు తమ ప్రభుత్వం అండగా ఉంటున్నదని చెప్పారు. మహిళ ఆర్థికంగా ఎదిగితే కుటుంబం బాగుపడుతుందనే ఉద్దేశంతోనే 15 ఏండ్ల నుంచే మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరే అవకాశాన్ని కల్పించామని తెలిపారు. ఆర్టీసీలో 200 కోట్ల మహిళా ప్రయాణాలు జరిగాయంటే మహిళలకు ఫ్రీ బస్సు బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలను బస్సు ఓనర్లుగా చేసింది తమ ప్రభుత్వమేనన్నారు.

## భయపడకండి.. అండగా నేనున్నా



పటాన్‌చెరు :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడొద్దని, ప్రతి ఒక్కరికి తనతో పాటు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఆరోపణలపై అరెస్టయ్యి బెయిల్‌పై తిరిగి వచ్చిన నల్ల బాలు (శశిధర్ గౌడ్)ను సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పోచారం గ్రామంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, నాయకులతో కలిసి కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా శశిధర్ గౌడ్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అక్కడే కేటీఆర్ కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకను చేసుకున్నారు. శశిధర్ గౌడ్ పిల్లలకు బహుమతులు అందించారు. వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలపై కార్యకర్తలు ఇంకా గట్టిగా నిలదీయాలని సూచించారు. తప్పుడు కేసులకు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కాగా, మాజీ మంత్రి కేటీఆర్ ఆయన ఇంటికి వచ్చి పరామర్శించి భోజనం చేయడంతో ఎంతో భరోసానిచ్చినట్టు అయిందని బీఆర్ఎస్ శ్రేణులు చర్చించుకుంటున్నారు. కేటీఆర్ వెంట కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ బిక్షపతి, కార్పొరేటర్లు వి.సింధు ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్, మాజీ జెడ్పీటీసీలు శ్రీకాంత్ గౌడ్, బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో రహదారులను పూర్తి స్థాయిల్లో నిర్మిస్తాం



ఖమ్మం :అమృత్ తెలంగాణ: గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం రహదారుల నిర్మాణాలన్ని పూర్తి చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి పలు రహదారుల నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. గోళ్లపాడు నుంచి రామన్నపేట వరకు రూ.3.52 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, పల్లెగూడెం-మంగళగూడెం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఊటవాగు తండా వరకు రూ.75 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పున్ణనిర్మాణం పనులను ప్రారంభించారు. అలాగే, మంగళగూడెం నుంచి సర్వే నెం.272 వరకు రూ.165 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్ నిర్మాణం, కొత్తూరు నుంచి లకావత్ తండా వరకు రూ.2.20 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గంలో బురద లేని అంతర్గత రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కండ్లుగా కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. రూ.22,500 కోట్లతో ప్రభుత్వం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో మంజూరు చేశామన్నారు. ఎన్నో కార్యక్రమాలు అమలుచేసి, అర్హులకు అందజేస్తున్నామని, ఇంకా ఎంతో చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల, అభివృద్ధి సంస్థ చైర్మెన్ మువ్వా విజరు బాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, డీఈ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల బోర్డు చైర్మెన్, సభ్యుల నియామకంపై నోటీసు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కనీస వేతనాల బోర్డు చైర్మెన్, సభ్యులుగా కార్మిక సంఘాలకు చెందిన వాళ్లను నియమించారనే పిల్‌ను విచారించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. స్వతంత్ర వ్యక్తులను నియమించాలన్న నిబంధనల కు వ్యతిరేకంగా కనీస వేతనాల బోర్డు చైర్మెన్‌గా జనక్ ప్రసాద్, సభ్యుడిగా ఎస్.నరసింహారెడ్డిలను ప్రభుత్వం నియమించిందనే పిల్‌కు నెంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ నియామకంపై కౌంటర్లు దాఖలు చేయా లంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక ఉపాధి శాఖ ముఖ్యకార్యదర్శి, కార్మికశాఖ కమిషనర్‌లతో పాటు బి.జనక్‌ప్రసాద్, ఎస్.నరసింహారెడ్డిలకు వ్యక్తిగత హోదాలో నోటీసులు జారీ చేసింది. వారిద్దరి నియామక జీవోలు 443, 21లను సవాలు చేస్తూ ట్రేడ్ యూనియన్ కార్యకర్త జి.శ్రీనివాస్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ పి.శ్యాం కోశీ డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. అడ్వొకేట్ చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ, వాళ్లిద్దరూ అధికార పార్టీకి చెందిన వారనీ, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (ఐఎన్‌టీయూసీ) నేతగా జనక్ ప్రసాద్, సింగరేణి కాలరీస్ ట్రేడ్ యూనియన్ నేతగా నరసింహారెడ్డి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన పదవిలో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని నియమిస్తే కనీస వేతనాలు పెంపునకు ఆస్కారం ఉండబోదన్నారు. చైర్మెన్, సభ్యుల నియామకం కనీస వేతనాల చట్టం నిబంధనలకు విరుద్ధమన్నారు. స్వతంత్ర వ్యక్తులను నియమించాలనే నిబంధనలకు వ్యతిరేక మన్నారు. చట్ట విరుద్ధంగా నియామకం జరిగిందన్నారు. విచారణ వాయిదా పడింది.

విద్యుత్ సంస్థలకు ఊరట

విద్యుత్తు సరఫరాలో లోటు ఛార్జీల బకాయిలు రూ.179 కోట్లు చెల్లించాలంటూ సీఈఆర్సీ (సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులరేటరీ కమిషన్) ఇచ్చిన నోటీసులపై ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. సీఈఆర్సీ ఇచ్చిన డిమాండ్ నోటీసును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులను సమన్వయం చేస్తూ గ్రిడ్‌కు అదనపు విద్యుత్తు అందించినందుకు రూ.179 కోట్లు బకాయిలు చెల్లించాలంటూ సీఈఆర్సీ జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ పి.శ్యాంకోశీలతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్.శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ రెగ్యులేటరీ నిబంధనలు గత ఏడాది సెప్టెంబరు 16న అమల్లోకి వచ్చాయనీ, నిబంధనలు అమల్లోకి రాకముందు బకాయిలను చెల్లించాలనడం సరికాదన్నారు. రాష్ట్రానికి సరఫరా సమయంలో జరిగిన హెచ్చుతగ్గులకు చెందిన వాస్తవ ఛార్జీలను చెల్లించడానికి సిద్ధమేనన్నారు. అయితే ఇతర రాష్ట్రాలకు చెందిన భారాన్ని రాష్ట్ర సంస్థలపై మోపడం సరికాదన్నారు.

## ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో వర్షాలు, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరిం చారు. తక్షణమే జిల్లాలకు వెళ్లి, ప్రభుత్వ ఆస్పత్రుల ను సందర్శించాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి పర్యటనలో ఉన్న మంత్రి.. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఇతర ఉన్నతాధికారులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రివెంటివ్ మెజర్స్‌పైన దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో అవేర్‌నెస్ క్యాంపులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో యాంటిలార్వాల్ ఆపరేషన్స్, ఫాగింగ్, ఇండోర్ స్ప్రేయింగ్ విస్తృతంగా చేయాలన్నారు. క్రమం తప్పకుండా మంచి నీటి నమూనాలను పరీక్షించా లని చెప్పారు. సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ పెరిగే అవకాశం ఉన్నందున, ఓపీ కౌంటర్లను పెంచాలనీ, సమయాన్ని పొడిగిం చుకోవాలని ఆదేశించారు. ప్రయివేటు హాస్పిటళ్లపై నిఘా పెంచాలనీ, డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిల్లులు అధికంగా వేసే హాస్పిటళ్లపై నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ పనులు ఊపందుకున్న నేపథ్యంలో రైతులు ఎక్కువ సమయం పొలాల్లోనే గడుపుతారనీ, ఈ క్రమంలో పాము, తేలు కాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందనీ, అయితే ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి టీచింగ్ హాస్పిటల్ వరకూ అన్నింటిలో పాము, తేలు కాటు పేషెంట్లకు ట్రీట్ మెంట్ అందించేందుకు అవసరమైన మెడిసిన్, ఇంజెక్షన్లు అందుబాటులోకి ఉంచుకోవాలన్నారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీలను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. భారీ వర్షాలు, గాలుల వల్ల విద్యుత్ అంతరాయం తలెత్తే ప్రమాదం ఉన్నందున, హాస్పిటళ్లలోని జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దగ్గు, జలుబు, జ్వరం, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టీజీఎం ఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదరుకుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజరుకుమార్, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు తదితరులు జిల్లాల్లో పర్యటించనున్నారు.

## తెలంగాణకు అదనంగా 450 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రైతుల భవిష్యత్తు కోసం, దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం.. సాగుకు సౌరశక్తే మార్గం అంటూ కేంద్ర గనుల, బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ప్రధానమంత్రి కుశుమ్ యోజన ఫోకస్‌ను గుర్తు చేస్తూ తెలంగాణ రైతులకు భారీ ఊరట కలిగించే ప్రకటనను ఎక్స్ వేదికగా చేశారు. "తెలంగాణకు అదనంగా 450 మెగావాట్ల డీసెంట్రలైజ్డ్ గ్రిడ్-కనెక్టెడ్ సోలార్ పవర్ ప్లాంట్లుకు ఆమోదం లభించిందని, అలాగే 20,000 సౌర వ్యవసాయ పంపులను కూడా మంజూరు చేశారు" అని కిషన్ రెడ్డి తెలిపారుతెలంగాణకు అపారంగాఉన్న సౌరశక్తి సామర్థ్యాన్ని గుర్తు చేస్తూ కిషన్ రెడ్డి తెలంగాణ సర్కార్‌పై తీవ్రమైన విమర్శలు చేశారు."2026తో స్కీమ్ ముగుస్తుంది. అయితే ఇప్పటివరకు తెలంగాణలో పలు ప్రాంతాల్లో అమలు శూన్యంగా ఉంది. దీనిని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతున్నాను. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నది పూర్తి సత్యం" అని కిషన్ రెడ్డి విమర్శించారు.

## 51 మంది మావోయిస్టులు లొంగుబాటు



చర్ల: అమృత్ తెలంగాణ: ఛత్తీస్‌గఢ్‌లో పెద్దఎత్తున మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. నారాయణపూర్, సుక్మా, బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో కలిపి మొత్తం 51 మంది ఆయుధాలు వీడారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడం, ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో నక్సల్స్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. 2024 నుంచి ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్‌లలో 185 మంది మావోయిస్టులు మృతిచెందారని, 803 మంది అరెస్టు కాగా.. 431 మంది లొంగిపోయారన్నారు.

# కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ ఎమ్మెల్యే





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ కేంద్ర పెట్రోలియం సహజవాయువు విభాగ మంత్రి హోరదీప్ సింగ్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లను ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ లు ఢిల్లీ లో కలిశారు ఇంటింటికి సహజవాయువు గ్యాస్ పైపు లైన్ ఏర్పాటు, ద్విచక్ర వాహనాలలోనూ సహజవాయు, విద్యుత్ ఛార్జింగ్ పాయింట్లు నెలకొల్పాలని కోరారు. అదేవిధంగా ఆర్మూర్ నిర్మల్ రైల్ మార్గానికి సర్వే పూర్తి చేయించి నిధులు విడుదల చేయాలన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న వంతెనలకు పూర్తి నిధులు కేటాయించాలని విన్నవించారు. ఆయా సమస్య లపై మంత్రులు సానుకూలంగా స్పందించారని ఎంపీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. వీరితోపాటు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ముస్తాపూర్ అశోక్ ఉన్నారు.

# ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్య....

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన

### - బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్...



టెంబుర్ని నీలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన విశారదన్ మహరాజ్

నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి):జులై 24 అమృత్ తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి లేక దుబాయి వెళ్లి ప్రమాదంలో మరణించిన బొగడమీది సంతోష్, ది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలంలోని టెంబూర్ని గ్రామం దుబాయిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన బొగడ మీది సంతోష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చేపలు పట్టి జీవనం సాగిస్తున్న సంతోష్ కు ప్రభుత్వం సరైన జీవనోపాధి కల్పిస్తే దుబాయ్ దేశం వెళ్లి చనిపోయేవాడు కాదని ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో సరైన ఉపాధి అవకాశాలు లేకనే ఇక్కడి నుంచి చాలామంది ప్రజలు గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది అన్నారు. ఇది ప్రమాదకరంగా చనిపోవడం కాదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హత్యగానే చూస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ యాటకారి సాయన్న, ఎన్నారై రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్ల రాష్ట్ర కార్యదర్శి అన్నేల లక్ష్మణ్ జిల్లా కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ భూమేష్ సుధాకర్ శ్రీనివాస్ ముత్యం శేఖర్ పాల్గొన్నారు.

## జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గురువారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఉట్నూర్ మండలం నాగపూర్ శివ సాగర్ ప్రాజెక్ట్, పులిమడుగు బ్రిడ్జి, ముత్నూరు లోని కల్వర్టులను పరిశీలించారు.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా అతి భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని , భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆన్నారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారి విఠల్, డిప్యూటి ఇంజనీర్ వినోద్, AE లు, తదితరులు ఉన్నారు.

# మంజూరైన సబ్ స్టేషన్ ల పనుల ప్రక్రియను వేగవంతం చేయండి

### విద్యుత్ సమస్యలపై విద్యుత్ శాఖ ఎస్. ఇ. తో చర్చించిన ఎమ్మెల్యే



నిర్మల్ జిల్లా ముధోల్ జూలై 24 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గంలో మూడు విద్యుత్ సబ్ స్టేషన్ లు మంజూరు కావడంతో పనుల ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ ఎస్. ఇ. సాలియ నాయక్, కు లిఎమ్మెల్యేపవార్ రామరావ్ పటేల్, సూచించారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఎస్. ఇ. మర్యాదపూర్వక భేటీ అయిన సందర్భంగా పలు సమస్యలపై చర్చ జరిగింది. వర్షాలు కురుస్తున్న తరుణంలో విద్యుత్ సరాఫరా కు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, మరమ్మత్తులు చేయాలన్నారు. ప్రజాని కానికి, మూగజీవాలకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.. ఆయన వెంట భైంసా విద్యుత్ శాఖ డి. ఇ. శ్రీనివాస్ రెడ్డి ఎ. డి. ఇ. ఆదిత్య పటేల్ ఉన్నారు.

# కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ .

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

## జిల్లా పాలనాధికారి రాజర్షి షా, శాసన సభ్యులు వెడ్మ బొజ్జు .





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమం లో భాగంగా గురువారం ఉట్నూర్ HKGN ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఆహార భద్రత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పాలనాధికారి రాజర్షి షా, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి కొత్త రేషన్ కార్డులు పంపిణీ, కళ్యాణ లక్ష్మి,షాది ముభారాక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, డీసీసీబీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, mro, సివిల్ సప్లై అధికారి వాజిద్, సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తున్నదని సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి పథకం అందించి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించి, మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నదని ఆన్నారు. రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారు నమోదు చేయించుకోవాలని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆన్నారు. ఎవరైనా చనిపోయిన లేదా రేషన్ కార్డులలో పేర్లు తప్పుగా నమోదై ఉంటే స్వచ్ఛందంగా వారి పేర్లు తీసివేయించాలని కోరారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల కల ఈ రోజు నెరవేరిందని , రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటన్నిటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉట్నూర్ లో కొత్తగా సుమారు మూడు వేల రేషన్ కార్డులలో 2081రేషన్ కార్డులు వచ్చాయని తెలిపారు. రేషన్ కార్డులు రానివారు ఇప్పుడుకూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం వెంటనే వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని తెలిపారు.

# సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి.

నిర్మల్ జిల్లా దేగాం జూలై 24 అమృత్ తెలంగాణ దెగం గ్రామంలో గురువారం మాజీ ఎమ్మెల్యే నివాసంలో కుబీర్ మండలంలోని పార్టీ బి గ్రామానికి చెందిన దిలీప్ అనే లబ్ధిదారునికి సుమారు 35000 రూపాయిల సీఎం సహాయనిధి చెక్కును అందించడం జరిగింది. సీఎం సహాయనిధి చెక్కు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి మన నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులి కు ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, అభినందనలు తెలిపారు ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి పదవిలో ఉన్న లేకున్నా ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూనా ఎమ్మెల్యేను ముఖ్యమంత్రి ఇన్చార్జి మంత్రి యొక్క మన్ననాలు పొందుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ఆయనను నియోజకవర్గ ప్రజలు లబ్ది పొందిన లబ్ధిదారులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నారుఈ కార్యక్రమం లో గంగాధర్, మిలింద్, జి. తుకారాం,గంగారాం, శంకర్, అంజాత్ ఖాన్, లక్ష్మీకాంత్, కాశినాథ్, కిషోర్, పాండురంగ్, రఘునాథ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కునూ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

# పీఎం జన్మన్ పనులు వేగవంతం చేయాలి

## కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభూ నాయర్






అమృత తెలంగాణ నిర్మల్ న్యూస్ పీఎం జన్మన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహాభియాన్) కార్యక్రమాన్ని వేగంగా పూర్తిచేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభూ నాయర్ రాష్ట్ర కలెక్టర్లకు సూచించారు. గురువారం సాయంత్రం ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధార్ నమోదు, జన్ధన్ ఖాతాలు, పక్కా ఇళ్లు, పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి పథకాలను విజయవంతంగా అమలు చేయాలని, కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఆది కర్మయోగి కార్యక్రమాన్ని క్రమబద్ధంగా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యదర్శి జిల్లాల్లో చేపడుతున్న మౌలిక వసతుల నిర్మాణం, స్థల సేకరణపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, పీఎం జన్మన్ కింద చేపట్టాల్సిన అన్ని పనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనుమతి లభించిన గ్రామాల్లో అర్హుల గుర్తింపు కోసం పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహించాలని, సేకరించిన సమాచారం యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని 24 హాబిటేషన్లలో 771 పక్కా గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు, వసతి గృహాలు, ప్రైమరీ పాఠశాలలు, రోడ్డు కనెక్టివిటీ, మల్టీపర్పస్ సెంటర్లు నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిపిఒ శ్రీనివాస్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఎల్డీఎం రామ్‌గోపాల్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి కూలిన ఇల్లు

జన్నారం : అమృత్ తెలంగాణ: జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో అకాల వర్షాలకు నిరుపేద కుటుంబమైన మేకల భాగ్య ఇల్లు కూలిపోవడంతో వారికి కాంగ్రెస్ పార్టీ తరపున ఆర్థిక సహాయం చేయడం జరిగినదని మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండో లిస్టులో ఇందిరమ్మ ఇల్లు పెట్టిస్తామని భరోసా ఇవ్వడం జరిగినదన్నారు. ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన వారికి 25 కిలోల బియ్యం, అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ గోపిచంద్ నాయక్, కిష్టాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద నాయక్ ఉపాధ్యక్షులు వాసాల భాస్కర్ జనరల్ సెక్రెటరీ మూగల సుధాకర్ జాయింట్ సెక్రెటరీ రేణిగుంట బాపూరావు కోశాధికారి బండారి వినయ సాగర్ నాయకులు గంగారపు మల్లేష్ చిందం లచ్చన్న మేకల కొమురయ్య కొప్పుల రాము మూగల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



# తన సొంత ఎద్దులను తరలిస్తున్న రైతుని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ముఠాపై కేసు, నలుగురు ముఠా సభ్యుల అరెస్టు.

**ముఠాలోని ఏడు గురు సభ్యుల పై తాంసి పోలీస్స్టేషన్లో కేసు, నలుగురి అరెస్టు, ముగ్గురి పరారీ.**

**రౌడీ షీటర్ రోహిత్ షిండే మరియు అతని గ్యాంగ్ రైతుని బెదిరించి, డ్రైవర్ని కొట్టి, డబ్బులు వసూలు చేసి తిరిగి రైతుపై తాంసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన దుండగులు.**

**నిందితులకు భయపడి ఆలస్యంగా ఫిర్యాదు చేసిన రైతు.**

**బెదిరింపులు,మోసం, అక్రమ వసూళ్లు, దుర్మార్గం గా కొట్టడం లాంటివి చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు.**




**అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్**

వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ రూరల్ సీఐ కె ఫణిధర్.

నిందితుల వివరాలు

A1) రోహిత్ షిండే (absconding)

A2) బత్తినీ విశ్వతేజ్ s/o బి. సారథి, వయసు: 23 సంవత్సరాలు, నివాసం: తిలక్ నగర్, ఆదిలాబాద్

A3) దగిడే సాయి (absconding)

A4) బట్టు మహేష్ s/o అశన్న, వయసు: 36 సంవత్సరాలు, నివాసం: ఖోడాడ్ గ్రామం, తలమడుగు మండలం

A5) శివ (absconding)

A6) రమేష్ వైరాగి ఏ వైరాగి రమేశ్వర్ s/o లేట్ నివర్తి, వయసు: 30 సంవత్సరాలు, నివాసం: మన్నూర్ గ్రామం, గుడిహత్నూర్ మండలం

A7) విజయ్ కేంద్రే ఏ కేంద్రే విజయ్ s/o గణపతి, వయసు: 24 సంవత్సరాలు, నివాసం: మన్నూర్ గ్రామం, గుడిహత్నూర్ మండలం

కేసు వివరాలలో

2024 సెప్టెంబరు 23న తలమడుగు మండలం కుచ్లాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు ఆత్మరాం బాపూరావు షిండే s/o బాపూరావు, తన 3 ఎద్దులు, 3 కంకలు (claves) ఆదిలాబాద్ మార్కెట్‌కి అమ్మకం నిమిత్తం తీసుకెళ్లడానికి మహారాష్ట్రకు చెందిన దీపక్ అనే వ్యక్తికి చెందిన బొలెరో పికప్ వాహనాన్ని ?2,500కు అద్దెకు తీసుకున్నాడు. దీపక్ తన డ్రైవర్ పిట్కులే అంకుష్‌తో వాహనాన్ని పంపాడు. ఉదయం 8:30 గంటలకు ఎద్దులు, కంకలను వాహనంలో ఎక్కించి ఆదిలాబాద్‌కి బయలుదేరారు.

అయితే అదే రోజు ఉదయం 9:30 గంటల ప్రాంతంలో తాంసి మండలం పొన్నారి శివార్ వద్ద ఆదిలాబాద్‌కు చెందిన రోహిత్ షిండే, విశ్వ తేజ, దగడ్ సాయి, మహేశ్, శివ, రమేశ్ వైరాగి, విజయ్ కేంద్రే అనే వ్యక్తులు వాహనాన్ని అడ్డగించి డ్రైవర్‌ను కొట్టారు. అనంతరం రైతును బెదిరించి ?10,000 డిమాండ్ చేశారు.

రైతు తనదైన పశువులను తీసుకెళ్తున్నానని చెప్పినప్పటికీ.. "మా అనుమతి లేకుండా అమ్మకాలు చేయలేవు. మళ్లీ ఆదిలాబాద్ వస్తే నీ అంతు తెలుస్తాం" అంటూ బెదిరింపులకు దిగారు. భయంతో రైతు ?5,000 ఇవ్వగా, మిగిలిన డబ్బులు ఇవ్వలేదని తాంసి పోలీస్ స్టేషన్‌లో అతని మీదే ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఈ సంఘటన జరిగినప్పటి నుంచి బెదిరింపుల భయంతో రైతు మౌనంగా ఉండగా, ఇటీవల పోలీసులు ఇటువంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటున్న విషయం తెలుసుకుని జూలై 22న తాంసి పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేశాడు.

రైతు ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన తాంసి పోలీసులు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.పశువుల అక్రమ రవాణా ను అడ్డుకుంటున్నామనే కారణాన్ని ముసుగుగా తీసుకుని రైతులపై బెదిరింపులకు పాల్పడే రౌడీలపై కఠిన చర్యలు తీసుకుంటాం. రైతుల్ని గౌరవించని వాళ్లను చట్టం గౌరవించదు. బాధితులు భయపడకుండా తమ ఫిర్యాదులను సమీప పోలీస్ స్టేషన్లకు అందజేయాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ కే ఫణి ధర్ తెలియజేశారు.

# ప్రభుత్వ సబ్సిడీ ద్వారా అందిస్తున్న ఫర్టిలైజర్ యూరియాను తరలించే క్రమంలో ఈ నెల జూలై 8న నమోదైన కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు - జైనథ్ సిఐ డి సాయినాథ్




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఈ నెలలో విశ్వసనీయ సమాచారం మేరకు రెండు వాహనాలలో 150 బ్యాగుల ఫర్టిలైజర్ను మహారాష్ట్రకు తరలించిన ముఠాలో కీలక నిందితుడు A1 అరెస్టు. జులై 8 తారీఖున ఐదుగురిపై బేల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు నిందితుడు A-1 సునీల్ (హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ) ప్రొప్రైటర్ అరెస్ట్. ఈ నెల 8 వ తారీకున బేలా పోలీస్ స్టేషన్ నందు విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా పోలీసులు 150 సంచుల్లో ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న ఫర్టిలైజర్ను అక్రమంగా తరలిస్తున్న ముఠాలోని కీలక సభ్యుడిని హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రొప్రైటర్ ఏ వన్ సునీల్ ను ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని జైనథ్ సిఐ డి సాయినాథ్ తెలియజేశారు. ఈ కేసు నందు రెండు వాహన లను సీజ్ చేసి ఇద్దరు డ్రైవర్లను సంఘటన స్థలంలో అదుపులోకి తీసుకుని, మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని, అందులోని మొదటి సభ్యుడు A-1 సునీల్ ను ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 8వ తారీఖున జరిగిన ఈ వాహన స్వాధీనం సందర్భంలో దాదాపు 150 బ్యాగుల్లో 67.5 క్వింటల్లా ఫర్టిలైజర్ ను మహారాష్ట్రకు తరలించకుండా జిల్లా పోలీసులు అడ్డుకొనడం జరిగిందని నిర్వాహకులకు పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు ఈ కేసులో మొదటి నలుగురిని అరెస్టు చేయడం జరిగిందని, ప్రస్తుతం ప్రధాన నిందితుడు ఒక్కరిని అరెస్టు చేయడం జరిగిందని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, రైతుల సంక్షేమం కొరకు నకిలీ విత్తనాలు అమ్మిన వారిపైన కూడా కఠిన చర్యలు తీసుకున్నట్లు జిల్లా పోలీసులు ప్రజల రక్షణకై అనుక్షణం ఎల్లవేళలా కృషి చేస్తూ ఉంటారని తెలిపారు.

# అత్యవసర సమయాలలో తప్ప బయటికి రాకూడదు - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

**3 రోజులపాటు జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రంగా పూర్తి అప్రమత్తత.**

**24/7 అందుబాటులో అత్యాధునిక సదుపాయాలతో డిడిఆర్ఎఫ్ (DDRF) బృందం.**

**యువత జలపాతాల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించి ఉండాలని సూచన.**

**ఎటువంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలి.**

**కల్వర్టులపై, బ్రిడ్జిల పైనుండి నీరు ప్రవహించే క్రమం లో దాటకుండా ఉండాలి.**

**లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాష్ట్ర వాతావరణ శాఖ మూడు రోజుల పాటు భారీ వర్షాలు సూచించిన దృష్ట్యా జిల్లా ప్రజలకు ఎటువంటి ప్రమాదం తలెత్తకుండా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ సూచనల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం, జిల్లా పోలీసు అధికారులు ఎల్లవేళలా అప్రమత్తతతో విధులను నిర్వర్తిస్తుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రత్యేక టెలి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి జిల్లా పోలీసు అధికారులకు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు అత్యవసర సమయాలలో తప్ప బయటకి రాకూడదని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్న అత్యవసర సమయంలో డయల్ 100 కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలని సూచించారు. నూతనంగా శిక్షణ తీసుకున్న డిడిఆర్ఎఫ్ బృందం జిల్లాలో 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా కాపాడతారని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని పోలీస్ స్టేషన్ల నందు అప్రమత్తతతో ఉంటుందని తెలిపారు.

భారీ వర్షాలు పడి వరదలు సంభవించినప్పుడు కల్వట్ల ను, బ్రిడ్జిలను, గమనిస్తూ ఉండాలి.

బ్రిడ్జిలపై నుండి నీరు ప్రవహించే సమయాలలో ప్రజలు వాటిని దాటకుండా ఉండాలని సూచించారు.

యువకులు అత్యుత్సాహంతో ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతాలు, వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు,చెరువుల వద్దకు వెళ్ళరాదు.

జలాశయాలు, చెరువులు, వాగుల వద్ద మత్స్యకారులు, ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు.

వర్షం భారీగా ఉన్నప్పుడు పొలాలలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకకుండా ఉండాలని సూచించారు.

చెట్ల కింద, పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల పక్కన ఉండకుండా చూడాలి.

ముఖ్యంగా విద్యార్థులు, పిల్లలు పాత భవనాలలో ఉండకుండా చూడాలని తెలిపారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జలపాతాలు, చెరువులు, కుంటలు, అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకలు దగ్గర నీటి ప్రవాహం స్థితిగతులపై ముందస్తు సమాచారం తెలుసుకొని ప్రత్యక్షంగా వెళ్లి పోలీస్ అధికారులు పర్యవేక్షించాలని తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజల రాకపోకలను గమనించాలని సూచించారు.

వాహనదారులు రోడ్లపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, నీటి ప్రవాహం, వర్షం వల్ల ఏర్పడిన గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందని జాగ్రత్తగా వాహనాలని నడపాలని సూచించారు. ఇలాంటి ప్రదేశాలలో ప్రత్యేకంగా పోలీసు సిబ్బంది సైన్ బోర్డులనెర్పాటు చేయాలని సూచించారు.

# ఇబ్రహీంపట్నం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల కార్యశాల



సమావేశంలోమాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ జూలై 24 భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలు ఎంపిటిసి జడ్పిటిసి ఎలక్షన్ల మండల కార్యశాల ఇబ్రహీంపట్నం మండల బిజెపి అధ్యక్షులు బాయి లింగ రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ఇబ్రహీంపట్నం మండల బిజెపి ఇంచార్జి Dr వెంకట్ రెడ్డి అలాగే ఇబ్రహీంపట్నం మండల ప్రభారీ ధోనికెలా నవీన్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ధర్మం వైపు మొగ్గు చూపుతుందని,నరేంద్ర మోడీ నాయకత్వంలో గ్రామాల్లో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం నుండి ఇస్తున్నారు అని, బిజెపి లో కుటుంబ పాలన లేదని, స్థానిక ఎన్నికలలో విజయం సాధించే దిశగా కార్యకర్తలు పని చేయాలని, దేశంలో ప్రతి పౌరుడు దేశాభివృద్ధికై పాటుపడాలని,దేశంలో ప్రతి పౌరుడి ఎదుగుదలే బిజెపి లక్ష్యమని, అది మనం నమ్మిన సనాతన ధర్మం తోనే సాధ్యమౌతుందని, మరియు త్వరలో రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు బిజెపి కే పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని, నేటి నుండి బిజెపి ప్రతి కార్యకర్త ఒక ఆయుధం గా మారి స్థానిక ఎన్నికల్లో బీజేపీ అంటే ఏంటో చూపాలని, రానున్న ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీటీసీ, మరియు జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని అన్నారు .ఇట్టి కార్యక్రమంలో మండలం ప్రధాన కార్యదర్శులు సుంచు రణధీర్, పంతంగి వెంకటేష్ యాదవ్, జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బత్తుల శ్రీనివాస్,మండల నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జ్, బూత్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు సూచించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు సంబంధిత శాఖల అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండి తక్షణ పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాల వలన ఎక్కడైనా ప్రమాదం ఎదురైతే లేదా సాయం అవసరమైతే, నూతనంగా


ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 91005 77132 ను వెంటనే సంప్రదించాలని ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు

# విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించిన ఎల్‌డీఎం




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నిర్మల్ గ్రామీణ మండలంలోని సిద్ధులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు బాలశక్తి కార్యక్రమంలో భాగంగా ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమాన్ని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) రామ్ గోపాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రాథమిక సమాచారాన్ని అందించారు. ముఖ్యంగా సేవింగ్స్ ఖాతా, పాస్‌బుక్ ఫీచర్లు, IFSC కోడ్, MICR కోడ్, బ్రాంచ్ కోడ్, CIF (Customer Identification File) వంటి అంశాలను వివరించారు. పాస్‌బుక్‌లో కనిపించే ఖాతాదారుడి పేరు, ఖాతా సంఖ్య, ఈమెయిల్ ఐడీ, బ్రాంచ్ కోడ్, IFSC నెంబర్, ఫిర్యాదుల కోసం సంప్రదించవలసిన నెంబర్లు, ప్రధాన కార్యాలయ చిరునామా మొదలైన విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పాస్‌బుక్‌పై కనిపించే బార్‌కోడ్ గురించి, కరెన్సీ నోట్లపై ఉన్న భద్రతా లక్షణాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ భద్రతపై వీడియోలు ప్రదర్శించి, నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ లావాదేవీల్లో పాటించవలసిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు. డబ్బును ఎలా వినియోగించాలి? అవసరాలు, కోరికల మధ్య తేడా ఏమిటి? అనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆర్థిక విషయాలపై ఆసక్తిని కలిగించడంతో పాటు భవిష్యత్తుకు ఉపయోగపడే జ్ఞానాన్ని అందించిందని ఎల్‌డీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరిలో దొంగల హల్‌చల్



భువనగిరి : అమృత్ తెలంగాణ: భువనగిరి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గురువారం ఉదయం 3 గంటల సమయంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. కాలనీకి చెందిన వృద్ధురాలు శేషకుమారి రంగారెడ్డి జిల్లా మల్లాపురంలో తన కొడుకు వద్ద ఉంటుంది. రెండు వారాలకు ఒక సారి భువనగిరికి వచ్చి వెళ్తుంది. ఇందే క్రమంలో వారం రోజుల క్రితం వచ్చిన ఆమె నాలుగు తులాల బంగారం అభరణాలు, 11 వేల ఇంట్లో పెట్టి మరించిపోయి తన కుమారుని ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఉండడం లేదని గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.11 వేల నగదును దోచుకెళ్లారు. దీంతో పాటు నల్లగొండలో ఉంటున్న భువనగిరికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు రంగారావు, ఎంఏ లిగోరి ఇండ్లలోకి వెళ్లగా అక్కడ ఏమి దొరకపోవడంతో వెనుదిరి వెళ్లారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు చోరీ జరిగిన ఇండ్లను సందర్శించి ఆధారాలు సేకరించి సీసీ కేమేరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఇన్స్పెక్టర్ ఎం. రమేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 18వ తేదిన ఇదే ప్రాతంలో మూడు ఇళ్లలో చోరి జరిగింది. పగలురెక్కీ నిర్వహించాకే రాత్రి దొంగతనాలు చేస్తున్నారని పలువురు భావిస్తున్నారు. ఈ నెల 11వ తేదిన మధ్యాహ్నం రాంనగర్‌లోని బస్తీ దవఖానాకు వెళ్లి ఇంటికివెళ్తున్న పోతంశెట్టి శారధ మెడ నుంచి నాలుగు తులాల నుంచి బంగారు గొలుసును లాక్కొని వెల్లారు. భువనగిరి పట్టణంలో వరుస చోరీ ఘటనలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి.

# రెండవ స్పెల్ స్క్రీనింగ్ రాత పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలి: కలెక్టర్

భువనగిరి :అమృత్ తెలంగాణ: ఈ నెల 27 న జరగబోయే గ్రామ పాలనా అధికారి రెండవ స్పెల్ స్క్రీనింగ్ పరీక్ష పై మినీ మీటింగ్ హాల్లో అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. భువనగిరి జిల్లా కేంద్రంలోని ( వెన్నెల కాలేజ్ ఆవరణలో గల) భువనగిరి కాలేజీ అఫ్ ఎడ్యుకేషన్, అనంతారం లో ఈ నెల 27వ తేదీన ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పరీక్ష జరగనున్నట్లు తెలిపారు. జీపీఓటి -2025 నియామకంలో భాగంగా పూర్వ వీఆర్వో, వీఆర్ఏలకు ఆప్షన్ల కింద అవకాశం కల్పించి, వారి నుంచి దరఖాస్తులను కోరడం జరిగిందని, ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రభుత్వం చే జారీ చేయబడిన ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, హాల్ టికెట్ ప్రింట్ తీసుకొని రావాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 9 గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మూత్రశాలలు, తదితర మౌలిక వసతులను కల్పించాలని, వైద్య సిబ్బంది సరిపడా మందుల తో కేంద్రం వద్ద అందుబాటులో ఉండాలని, ఎక్కడా కూడా మాస్ కాపీయింగ్ కు ఆస్కారం ఇవ్వకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్ష సమయాలలో అదనపు బస్సులు ఏర్పాటు చేసి సమయానికి వచ్చేలా చూడాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు



తావులేకుండా పక్కాగా, ప్రశాంత వాతావరణంలో పరీక్షను జరిపించాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎవరికీ కూడా మొబైల్ ఫోన్ లకు అనుమతి లేదన్నారు. అలాగే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు. అదే విధంగా పరీక్ష ప్రశ్న పత్రాలను అత్యంత జాగ్రత్తగా పటిష్ట భద్రత నడుమ పరీక్ష కేంద్రానికి చేరవేయాలని, జవాబు పత్రాలను కూడా నిర్దేశిత ప్రాంతాలకు పంపించాలని సూచించారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ షాపులు పోలీస్ బందోబస్తుతో మూసి వేయించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలలో అడ్మినిస్ట్రేషన్ అధికారి జగన్మోహన్ ప్రసాద్,సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీ రంగానికి వన్నెతెచ్చిన ఘనత కేటీఆర్ కే దక్కుతుంది



మునుగోడు :అమృత్ తెలంగాణ: ఐటీ రంగానికి ఉన్న తెచ్చే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఐటి మంత్రి కేటీఆర్ కు దక్కుతుందని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందుల సత్యం అన్నారు. గురువారం కేటీఆర్ జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకల్లో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మండల నాయకులు మదనబోయిన పరమేష్ , ఈద శరత్ బాబు , మాజీ ఉప సర్పంచులు జంగిలి సాంబయ్య , ఎల్లంకి యాదగిరి , ఎడవెల్లి సురేష్ , డోకూరి వేణు , సోషల్ మీడియా మండల కన్వీనర్ దోటి కరుణాకర్ ,

బోయ గాలయ్య ,పూల వెంకన్న , నెల్లికంటి యాదయ్య, బండారి శ్రీను , సింగపంగా యాదగిరి, లింగస్వామి , నగేష్ , వెంకన్న తదితరులున్నారు.

# వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలని వినతి

ముధోల్ : విఆర్ఎల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ గురువారం ముధోల్ తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఎ జేఏసీ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీలతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో విఆర్ఎ లకు, పే స్కేలు వారసులకు ఉద్యోగులు ఇస్తామని ప్రకటించినా.. నేటివరకు అమలు చేయాలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 5 55 మంది విఆర్ఎ లు డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్ గా, ఇంటర్ చేసిన వారికి రికార్డు అసిస్టెంట్ గా పదో తరగతి లోపు చదివినవారిని ఆఫీస్ సబర్డినేట్ గా రెవెన్యూ శాఖతోపాటు, మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్య, వైద్య , శాఖలో చేర్చారని అన్నారు.

మిగతా 3797 మంది విఆర్ఎ ల వారసులకు ఉద్యోగా ఉత్తర్వులు ఇవ్వకుండా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని వారు ఆరోపించారు. జీవో నెంబర్ 81, 85 ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు వస్తాయని ఆశతో రెండు సంవత్సరం లుగా ఎదురుచూస్తున్న జీవోలు ఇచ్చినా స్పందన లేదని వారు పేర్కొన్నారు.

కొందరు తండ్రి ఉద్యోగం కోసం అన్నదమ్ములకున్న అరెకరం భూమిని




రాసిచ్చారని వారు వాపోయారు. అప్పులు చేసి తమ సోదరులకు లక్షల రూపాయలు వాటి కింద ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఉద్యోగం రాక చేసినప్పులకు వడ్డీలు పెరిగి ఆర్థికంగా మానసికంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నవీన్, ముత్యం, భూమన్న, పోతన్న, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పోస్టులు మంజూరు



ముధోల్ :అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు ఖాళీగా వున్న 8 అధ్యాపక పోస్టులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల లో 200 కు పైగా విద్యార్థుల సంఖ్య ఉండడం తో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని ఇటీవల ముధోల్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల తో కలిసి ఉన్నత విద్యామండలి చైర్మన్ బాల కృష్ణా రెడ్డి ని కలిశారు. అలాగే విద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రాలను అందించారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించి 8 అధ్యాపక పోస్టులు మంజూరైనట్లు తమకు సమాచారం అందిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు కలిసి ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.

# టాప్ చెయిర్ కోసమైతే ఇలా కష్టమే..!



అందం అభినయం ఉన్నా కూడా లక్ కలిసి రాని కొందరు హీరోయిన్స్ కెరీర్ లో వెనకబడుతుంటారు. అందం అభినయం ఉన్నా కూడా లక్ కలిసి రాని కొందరు హీరోయిన్స్ కెరీర్ లో వెనకబడుతుంటారు. కానీ అవన్నీ ఉన్నా కూడా సినిమాల సెలక్షన్ లో లేట్ చేస్తే ఆమెను కచ్చితంగా మాళవిక మోహనన్ అనాల్సిందే. సౌత్ లో ఇప్పటికే తన లుక్స్ తో ఆకట్టుకుంటున్న ఈ మలయాళ ముద్దుగుమ్మ క్రేజీ సినిమాలు చేస్తున్నా కూడా పెద్దగా అవకాశాలు రాబట్టుకోవట్లేదు. ఐతే ఛాన్సులు వస్తున్నా అమ్మడు చేయట్లేదా లేదా నిజంగానే అవకాశాలు రావట్లేదా అన్నది తెలియదు కానీ మాళవిక తన రేంజ్ పెంచుకోలేకపోతుంది. నితిన్ 'రాబిన్ హుడ్' సెన్సార్ టాక్.. ఇది మ్యాటర్! ప్రస్తుతం సౌత్ హీరోయిన్స్ కి మంచి డిమాండ్ ఏర్పడింది. ఇక్కడ ఉన్న వారినే బాలీవుడ్ లో కూడా తీసుకుంటున్నారు. ఐతే ఈ టైం లో మాళవిక మోహనన్ ఎందుకో వెనక పడింది. అందంతో పాటు అభినయం కూడా మెప్పించేలా ఉన్నా మాళవిక తన రేంజ్ సినిమాలు మాత్రం చేయలేకపోతుంది. 2019 నుంచి ఈ ఆరేళ్లలో కేవలం ఆరు సినిమాలు మాత్రమే చేసింది మాళవిక. ప్రస్తుతం అమ్మడు రెబల్ స్టార్ ప్రభాస్ తో రాజా సాబ్ సినిమా చేస్తుంది. ఈ సినిమా కోసం రెండేళ్లుగా కష్టపడుతుంది అమ్మడు. ఐతే రాజా సాబ్ ఛాన్స్ అందుకున్న తర్వాత తెలుగులో మరికొన్ని ఛాన్స్ లు వచ్చాయని టాక్. ఐతే వాటిని ఎందుకో మాళవిక చేయనని అనేసిందట. ఐతే ప్రతి హీరోయిన్ తమ కెరీర్ లో టాప్ లోకి వెళ్లాలని అనుకుంటారు. మాళవికకు ఆ ఆలోచనలు ఉన్నా.. అమ్మడి టాలెంట్ కి ఆ స్కోప్ ఉన్నా కూడా ఎందుకో బజ్ క్రియేట్ చేయలేకపోతుంది. రాజా సాబ్ తో పాటుగా మాళవిక కార్తితో సర్దార్ 2 సినిమాలో కూడా నటిస్తుంది మాళవిక. తమిళంలో వరుస సినిమాలు చేస్తూ వస్తున్న అమ్మడు తెలుగులో మాత్రం ఆఫ్టర్ రాజా సాబ్ అనే చెబుతుందట. పర్ఫెక్ట్ స్టార్ మెటీరియల్ అయిన మాళవిక ఇలా ఎందుకు చేస్తుంది అన్నది ఎవరికీ తెలియదు కానీ ఆమె ఫాలోవర్స్ మాత్రం మాళవిక స్టార్ క్రేజ్ వస్తే ఎంజాయ్ చేసేలా ఉన్నారు. తమిళ్ లో పేట, మాస్టర్, మారన్, తంగలాన్ సినిమాలు చేసిన మాళవిక అక్కడ ఒక మోస్తారు క్రేజ్ తెచ్చుకోగా రాజా సాబ్ హిట్ పడితే మాత్రం అమ్మడికి మంచి క్రేజ్ వచ్చే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.

# డెనిమ్స్‌లో మీనాక్షి సోయగాలు ఇప్పుడు మీనాక్షి

బ్లూ డెనిమ్స్ లో గుబులు రేపే ఫోజులతో చెలరేగిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ కుర్రకారు కంటికి కునుకుపట్టనీకుండా చేస్తోంది. అందంతో కవ్విస్తుంది.. ఫ్యాషన్ సెన్స్‌తో మురిపిస్తుంది. కాంపిటీషన్ ఎంత ఉన్నా, తననే ప్రజల కళ్లు వెంబడించే సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలుస్తుంది. ఈ భామలో మల్టీ ట్యాలెంట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంతకీ ఎవరీ ముద్దుగుమ్మ? అంటే.. నిస్సంకోచంగా మీనాక్షి చౌదరి గురించే ఇదంతా. ఇప్పుడు మీనాక్షి బ్లూ డెనిమ్స్ లో గుబులు రేపే ఫోజులతో చెలరేగిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ కుర్రకారు కంటికి కునుకుపట్టనీకుండా చేస్తోంది. మీనాక్షి బ్లూ అండ్ బ్లూ డెనిమ్ లుక్ లో ఎంతో సూపర్బ్ గా కనిపిస్తోందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. మీనాక్షి తన చేతికి బరువైన గాజులు, చెవికి కాంబినేషన్ జూకాల్ని ధరించి సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. ఒకే సినిమాతో మొదలైన మెగా - కోటా ప్రయాణం వెంకీతో సంక్రాంతికి వస్తున్నాం, మహేష్‌తో గుంటూరు కారం లాంటి భారీ చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి, టాలీవుడ్ కోలీవుడ్ లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. హిట్ ది సెకండ్ కేస్, గోట్, లక్కీ భాస్కర్ లాంటి క్రేజీ చిత్రాల్లోను మీనాక్షి నటించింది. ఈ భామ నాగచైతన్య సరసన ఓ చిత్రంలో నటిస్తోంది. అలాగే అనగనగా ఒక రోజు అనే చిత్రంలోను నటిస్తోంది. ఈ రోజుల్లో ఇండస్ట్రీలో నెగ్గుకు రావాలంటే, యూనిక్ నెస్ తో దూసుకురావాలని చెప్పే మీనాక్షి తనదైన



యూనిక్ నెస్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# ఇక్కడ రిజెక్ట్ చేశారని ఆగిపోలేదు..

బాలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ హీరోయిన్లలో విద్యా బాలన్ కూడా ఒకరు. బాలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ హీరోయిన్లలో విద్యా బాలన్ కూడా ఒకరు. ఆమె రీసెంట్ లో ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కెరీర్ స్టార్టింగ్ లో సౌత్ సినీ ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను వివరించిన సంగతి తెలిసిందే. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తో తాను చేయాల్సిన చక్రం సినిమా పర్మినెంట్ గా ఆగిపోవడంతో అందరూ తనను అపశకునంగా భావించారని ఆమె తెలిపారు. దాని వల్ల రాత్రికి రాత్రే ఆమె తొమ్మిది సినిమాలను ఎలా కోల్పోయారో కూడా ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. అలా తనపై అన్యాయంగా అపశకునం అని వేసిన ముద్ర తనకు తీవ్ర గాయాన్ని మిగిల్చిందని, కానీ ఎలాగైనా సినిమాలు చేసి సక్సెస్ అవాలనే దృఢ సంకల్పం వల్ల తాను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నట్టు ఆమె తెలిపారు. ఆ దృఢ సంకల్పమే తనను ఇండియన్ సినిమాలో ఓ గొప్ప రూట్ ను ఏర్పరచుకోవడానికి ఉపయోగపడిందని ఆమె వెల్లడించారు. మొదటిగా విద్యా బాలన్ తన యాక్టింగ్ కెరీర్ ను సౌత్ లో మొదలుపెట్టారు. అప్పటివరకు తమిళ, మలయాళ సినిమాల్లో నటించిన విద్యా బాలన్ సైన్ చేసిన చక్రం సినిమా అనుకోకుండా ఆగిపోవడంతో సౌత్ ఇండస్ట్రీ ఆ నిందను ఆమెపై వేసి నిందించడంతో క్రమంగా విద్యాకు సౌత్ లో అవకాశాలు రావడం తగ్గిపోయాయి. విద్యాకు టాలెంట్ ఉన్నప్పటికీ ఆమె ప్రాజెక్టులోకి వస్తే ఆ దురదృష్టం తమకెక్కడ వస్తుందోననే భయంతో ఫిల్మ్ మేకర్స్



ఆమెను తీసుకోవడానికి వెనుకడుగేశారు. విద్యా బాలన్ వెనుకడుగేయలేదు. ఆ ఎదురుదెబ్బను తట్టుకుని తన ఫోకస్ ను బాలీవుడ్ వైపు మళ్లించారు. 2005లో పరిణీత అనే సినిమాతో బాలవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విద్యా బాలన్, ఆ సినిమాతో ఎన్నో గొప్ప ప్రశంసలు అందుకున్నారు. దాని తర్వాత కహానీ, తుమ్హారీ సులు, శకుంతలా దేవి లాంటి సినిమాల్లో ఎంతో పవర్‌ఫుర్ నటనతో నటిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. సౌత్ ఇండస్ట్రీ మొత్తం తనకు నో చెప్పినా బాలీవుడ్ కు వెళ్లి నటిగా తానేంటే ప్రూవ్ చేసుకుని టాలెంట్, హార్డ్ వర్క్ ఉంటే ఎప్పటికైనా కెరీర్ లో రాణిస్తారని తెలిపారు.




# హీరామండి బ్యూటీ స్టన్నింగ్ లుక్




వైరల్ బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ ఇటీవల ఛాలెంజింగ్ పాత్రల్లో అవకాశాలు అందుకుంటోంది. సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన 'హీరామండి' వెబ్ సిరీస్‌తో సంజీదా షేక్ పేరు మార్మోగింది. ఈ బ్యూటీ అద్భుతమైన అభినయం, హావభావాల గురించి యువతరంలో చర్చ సాగింది. వేశ్య పాత్రలో సంజీదా అభినయానికి వందశాతం మార్కులు వేసారు. బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ ఇటీవల ఛాలెంజింగ్ పాత్రల్లో అవకాశాలు అందుకుంటోంది. ఇంతకుముందు హృతిక్ లోను ఈ భామ నటించింది. తైష్ (2020), కాళీ ఖుహీ (2020) లాంటి చిత్రాల్లోను నటించింది. ఇది మ్యాటర్! మరోవైపు సంజీదా వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ప్రఖ్యాత ఫ్యాబ్ లుక్ మ్యాగజైన్ కవర్ పేజీపై తాజాగా ఈ బ్యూటీ అదిరిపోయే ఫోజులిచ్చింది. సంజీదా బోల్డ్ గా తన అందాలను ఎలివేట్ చేసింది. పర్పుల్ కలర్ డిజైనర్ ఫ్రాక్ ని ధరించిన సంజీదా.. కిల్లర్ లుక్‌తో కట్టి పడేస్తోంది. ఈ గౌన్ థై స్లిట్ ఎలివేషన్ తన ఆకర్షణను పెంచింది. ఇక తన మెడలో ఉన్న ఆ డిజైనర్ చైన్ అంతే ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ని ఇంటర్నెట్ లో జోరుగా వైరల్ చేస్తున్నారు. శిష్యుడిని గురూజీ అంత భయపెట్టేస్తే ఎలా! 2024లో హీరామండితో గుర్తింపు పొందాక, 2025లో తన కెరీర్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే ఉత్సాహంతో కనిపిస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com